W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
8-2-2026





అక్రిడిటేషన్ కార్డుల జారీకి

# దరఖాస్తుల ఆహ్వానం

**కలెక్టర్ జితేష్ పాటిల్**



సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026--28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రెడిటే షన్ కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ శని వారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 02




08

# మధిర అంటే నాకు ప్రాణం

- మీ రుణం తీర్చుకుంటా నన్ను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు
- మధిరను అద్భుతమైన పట్టణంగా రూపుదిద్దుతా
- కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

# మేనిఫెస్టో లేదు.. మాటల గారడే



## అందరిదీ అదే దారి

- ప్రచారానికి వచ్చే అభ్యర్థులపై ప్రశ్నల వర్షం
- గల్లీలో హోరెత్తుతున్న పోటీదారుల ప్రచారం
- రేపటితో ప్రచారానికి తెర

కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. రెండు రోజులు మాత్రమే సమయం ఉండడం తో ప్రధాన పార్టీల అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులు ప్రచారానికి పదును పెట్టి కొందరు స్వయంగా ఓటర్లను కలిసి తను గెలిపిం చాలని వేడుకుంటున్న పరిస్థితి నెలకొంది. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని కొన్ని డివిజన్లలో ప్రచారానికి వచ్చే అభ్యర్థులను మేనిఫెస్టో ఎక్కడ..? అంటూ ఓటర్లు ప్రశ్నిస్తున్న పరిస్థితి ఏర్పడుతుంది. స్పష్టమైన హామీలు లేకుండా, సమస్యలకు పరిష్కార మార్గాలు చూపకుండా కేవలం మాయమాటలతో ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలపై పలు డివిజన్లలో విస్మయం వ్యక్తమవుతోంది.

08



### యువత, మహిళలే లక్ష్యం

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న వారంతా యువత, మహిళలే లక్ష్యంగా ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని లక్ష్యంతో యువత మహిళలే ఓటర్ల కీలక మని భావించి పావులు కదుపుతున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో అభ్యర్థుల ప్రచారం హోరుతో డివిజన్లు కళకళలా డుతున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. హామీలకే పరిమితం కాకండా నేరుగా ఓటర్లను ఆకర్షించే వ్యూహాల వైపు ప్రచారం మళ్లింది.

భద్రాద్రి బ్యూరో, మహా



### కమ్యూనిస్టుల గెలువు.. అభివృద్ధికి మలుపు

కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కార్పోరేషన్ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని సిపిఐ జాతీయ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ తెలిపారు. 05



మున్సిపాలిటీల్లో

### బిజెపి జెండా ఎగరడం ఖాయం

ఈనెల 11వ తేదీన కొత్తగూడెం ఇల్లందు అశ్వరావుపేటలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమని బిజెపి జాతీయ సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. 07



### మహా పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

మండల పరిధి పడమట నర్సాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏఎన్ఎన్ మహా పత్రిక నూతన క్యాలండర్ ను గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, ఉప సర్పంచ్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ తో కలిసి శనివారం ఆవిష్కరించారు 04



ఏసీబీకి చిక్కిన కొత్తగూడెం

### ఫారెస్ట్ డివిజనల్ మేనేజర్

భద్రాద్రి కొత్తగూడెం ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో రూ.28 లక్షల లంచం డిమాండ్ చేసిన కేసులో పరారీలో ఉన్న ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ తాటి శ్రావణిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. 06

FOLLOW: @ANNTELUGU
8-2-2026
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం



**దమ్మపేట ,మహా :** మండలంలో జరగనున్న ఉపాదీహామీ పనులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు డిఆర్డిఏ ,జిల్లా కార్యాలయం నుండి అడిషనల్ డిఆర్డిఏ నల్లబోతుల రవికుమార్ ఆద్వర్యంలో శనివారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆడినేపల్లి పంచాయతీ లోని నర్సరీ ప్లాంట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా మండల అధికారులకు ,పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. దానిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ లో సోమవారం నాటికి 50 మంది కూలీలు పని చేయాలని లక్ష్యం ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం మండలం లో 800 మంది పని చేస్తున్నారు, పంచాయతీ కీ 27 మంది వస్తున్నారని తెలిపారు. మార్చి లోపు లేబర్ బడ్జెట్ పూర్తి చేయాలి అని, మెటీరియల్ పనులు పూర్తి చేయాలి అని తెలిపారు.పల్లె ప్రకృతి వనాలు శుభ్రం గా ఉంచాలి అని, డంపింగ్ షెడ్ రోజు సక్రమంగా నిర్వహించాలి అని తెలిపారు. అన్ని పంచాయతీ లలో నర్సరీ బ్యాగ్ లు పూర్తి గా నింపి విత్తనాలు నాటాలి అని తెలిపారు. కార్యక్రమంలో ఆఖినేపల్లి నర్సరీ ని పరిశీలించారు. యం.పి.డి.వో .బి రవీంద్రారెడ్డి, ఏ.పి.వో సుధాకర్, సర్పంచ్ డి .నరసింహారావు రావు, సెక్రటరీ మొహ్మద్ పాషా తో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది ని అభినందించారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సమాచార పౌం ˇసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026--28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రెడిటే షన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ శని వారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలం ˇరిమితి గడువు ఫిబ్రవరి 28తో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారి నకు సమర్పించాలన్నారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http:// ipr.telangana. gov.in ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలలో ఆన్ లైన్ దరఖాస్తులను ఈనెల 9వ తేదీ నుండి సమర్పించాలని అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# సిఎం కప్ టోర్నీలో గీతాంజలి ప్రతిభ

**దమ్మపేట ,మహా :** తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిఎం.కప్ టోర్నమెంట్స్ లో దమ్మపేట కు చెందిన గీతాంజలి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్స్ లో ప్రథమ స్థానం కైవసం చేసుకొని విద్యార్థులు వీరశంకర్ ,జశ్వంత్ లు గీతాంజలి సత్తా నిరూపించారు. వీరిని జిల్లా స్థాయి టోర్నమెంట్స్ కు ఎంపిక చేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడిది వెంకటరత్నం ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల ను టోర్నమెంట్స్ కు శిక్షణ అందించిన పిఇటి నాగబాబును అభినందించారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థుల కు మిఠాయిలు పంపిణీ చేశారు.



# పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పెరటి కోళ్ల పెంపకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయ సమాకూరుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఎస్సీ కాలనీలో గ్రామీణ కుటుంబాల జీవనోపాధి స్థాయి మెరుగుదల లక్ష్యంగా నిర్వహించిన పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా కుటుంబ అవసరాలకు సరిపడా ఆదాయం లభించడంతో పాటు పోషక విలువలు గల ఆహారం కూడా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. లబ్ధిదారులు కోళ్లను శ్రద్ధతో, సరైన సంరక్షణతో పెంచుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 50 యూనిట్లను గాను, 50 మంది మహిళా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 20 చొప్పున కోడి పిల్లలను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రతి లబ్ధిదారులకి 10 కిలోల కోళ్ల దాణాతో పాటు అవసరమైన ఫీడర్లు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకంలో పాటించాల్సిన ప్రాథమిక అంశాలు కోళ్లకు అందించాల్సిన ఆహారం నివాస ఏర్పాట్లు, వ్యాధుల నివారణ టీకాల నిర్వహణ తదితర అంశాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఎన్ఎంఆర్ఐ, హైదరాబాద్‌కు చెందిన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ యోగేష్ దదేకర్ మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా కుటుంబ ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందని వివరించారు. ఐడీఓ గట్టుమల్ల డాక్టర్ కపిల్ శర్మ పెరటి కోళ్ల పెంపకాన్ని దీర్ఘకాలిక జీవనోపాధిగా అభివృద్ధి చేసుకునే విధానాలపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రామవరం పశు వైద్యులు డాక్టర్ ఆనందరావు, సంబంధిత శాఖల అధికారులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, గ్రామస్తులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మేము చేసిన తప్పేమిటి సారూ

**నేలకొండపల్లి, మహా:** ప్రజలు, పశువుల ప్రాణాలకు విలువ లేకుండా పోతుందని...బాధిత రైతులు అధికారుల ఎదుట వాపోయారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని అప్పలనరసింహాపురం లో స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ వలన పరిసర ప్రాంతాలలో ఉన్న వివిధ పంటలు దెబ్బతింటున్నాయని... బాధిత రైతులు ఇటీవల గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నివేదికను అందించాలని జిల్లా కలెక్టర్ స్థానిక తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు ను ఆదేశిచాంచారు. ఈ మేరకు శనివారం క్షేత్ర స్థాయిలో మిర్చి తోటలను పరిశీలించారు. రైతుల నుంచి సమస్యను అడిగి తెలుసుకునానరు. ఈ సందర్భంగా రైతులు వారి గోడు ను వినిపించారు. ఫ్యాక్టరీ వలన వచ్చే పొగ, దుమ్ము, కాలుష్యం వలన పంటలు దెబ్బతింటున్నాయని... భూసారం తగ్గి పంటలు దిగుబడి తగ్గుతుందని వాపోయారు. పరిసర ప్రాంతాలలో మంచినీటి కుంటలు అంతా రంగు మారిన నీటిని తాగిన పశువులు, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నామని అగ్రహాం వ్యక్తం చేశారు. పశువులు, ప్రజలు ప్రాణాలకు విలువ లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఏ తప్పు చేశాం సారూ...మాకు ఎందుకు ఇంత నష్టం... మీరే ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, జీపీవో షేక్ జానిమియా, బాధిత రైతులు పాల్గొన్నారు.



## గౌరారం పంచాయతీలో మద్యపానాన్ని నిషేధించండి

**మహా దుమ్ముగూడెం:** గౌరవరం గ్రామపంచాయతీలో మద్యపానాన్ని నిషేధించాలని సర్పంచ్ శ్యామల రవివర్మ కు మహిళలు వినతి పత్రం అందించారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రవి వర్మ అధ్యక్షతన నూతన పాలకమండలి సమావేశం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలు స్థానిక మహిళలు పాల్గొని మాట్లాడుతూ.. గ్రామంలో యువత చెడు వ్యసనాలకు గురవుతున్నారని, మద్యం మత్తులో యువత రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తాగిన మందు సీసాలు పొలాల్లో పడేయడం వలన రైతులకు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రజల ఆరోగ్యాన్ని గ్రామ సంక్షేమం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మద్యప్రాణాన్ని నిషేధించాలని కోరుకుంటూ సర్పంచ్ మహిళలు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ సానుకూలంగా స్పందించి గ్రామపంచాయతీలో అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ పంచాయతీ తీర్మానం చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ స్రవంతి వార్డు సభ్యులు సమ్మక్క శ్రీలత రమాదేవి వీరస్వామి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# గ్రామ అభివృద్ధే లక్ష్యం

**సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం ■ సర్పంచ్ లక్ష్మీ కుమారి**

**జూలూరుపాడు, మహా:** గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పడమట నర్సాపురం సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి అన్నారు. శనివారం పడమట నర్సాపురం గ్రామ పంచాయితీలో ఎస్డిఎఫ్, ఎంపీ లాండ్స్, ఎంజీఎన్ఆర్ఇజిఎస్ ఫండ్స్ క్రింద మంజూరి అయిన ఏడు రోడ్లు సుమారు 36.5 లక్షల విలువగల సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఉప సర్పంచ్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ప్రజల రవాణాకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని వీధులలో సీసీ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. అదేవిధంగా వీధిలైట్లు, పారిశుద్ధ్యం, నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను గ్రామంలో అర్హులైన పేద ప్రజలందరికీ సమానంగా అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజలంతా తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి హారిక, వార్డు సభ్యులు సంఘం సుహాసిని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రామాలయం చైర్మన్ లేళ్ళ అప్పిరెడ్డి, దామెర్ల రాములు, తెల్లబోయిన మల్లికార్జునరావు, వెలగా తిరుపతిరావు, పుప్పాల శ్రీనివాసరావు, లేళ్ళ నవీన్ రెడ్డి, సంఘం చిన్న రాజు, వెలగా రాంబాబు, చిన్న బుల్లయ్య, మార్కాపురి రాంబాబు, రామారావు, అద్దానపు మల్లికార్జునరావు, బానోత్ మంగు నాయక్, కాసిన్ని వెంకటేశ్వర్లు, దార బోయిన రవి, టి నరసింహారావు, రమేష్ పాల్గొన్నారు.



# మహా పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

## అభినందించిన సర్పంచ్





**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏఎన్ఎన్ మహా పత్రిక నూతన క్యాలండర్ ను గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, ఉప సర్పంచ్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ తో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అనతి కాలంలోనే మంచి వార్తా కథనాలతో ప్రజల దృష్టిని ఆకర్షించి ప్రజాదరణ పొందిన మహా పత్రిక యాజమాన్యానికి, పాఠకులను ఆకట్టుకునే విధంగా వార్తలను రంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్న సంస్థ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వార్త రూపంలో అధికారులు, పాలకుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి పత్రికా ముందు అడుగు వేయాలని, మహా పత్రికా రానున్న రోజుల్లో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి హారిక, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లేళ్ళ అప్పి రెడ్డి, సంఘం చిన్న రాజు, తెల్లబోయిన మల్లికార్జున్ రావు, పుప్పాల శ్రీనివాసరావు, లేళ్ళ నవీన్ రెడ్డి, దామెర్ల రాములు, మంగు నాయక్, ముస్తఫా, రవి, నరసింహారావు, బి రమేష్, నాగు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ డిఈఓ పోస్టులను భర్తీ చేయాలి



**మహా దుమ్ముగూడెం:** జిల్లాలో ఖాళీగా ఉన్న డిప్యూటీ డిఇఓ పోస్టులను వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన గెజిటెడ్ ఉపాధ్యాయులుతో భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కారం సర్వేశ్వరరావు దొర అన్నారు. శనివారం మండల పరిధిలోని నారాయణరావుపేట ఆశ్రమ పాఠశాలలో శాఖ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి సంఘం నూతన క్యాలెండర్ ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యా వ్యవస్థను మరింత బలోపేతం కోసం డిప్యూటీ డిఈఓ పోస్టులను సీనియర్ గెజిటెడ్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని అన్నారు. గిరిజన సంక్షేమ ప్రభుత్వ పాదమిక పాఠశాలలో స్కాంవెంజర్స్ నియమించి, ఖాళీగా ఉన్న పోస్టులను ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. 2010 ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు




# చదువుల్లో రాణిస్తే నగదు బహుమతి

- విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యం
- ప్రతిభకు మరింత పదును పెట్టండి
- జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి
- మిషన్ పదవ తరగతి పోస్టర్‌ను ఆవిష్కరణ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన మిషన్ పదవ తరగతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన "మిషన్ పదవ తరగతి" కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. చదువుతోనే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. మన జిల్లాలోని 111 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా మొదటి స్థానాన్ని సాధించిన విద్యార్థికి రూ.5 లక్షలు, రెండవ స్థానానికి రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల టాపర్లకు రూ.1లక్ష చొప్పున, అలాగే 612 మండలాల టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 2026 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో పాటు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సంస్థలు విద్యారంగానికి తోడ్పడటం అభినందనీయమని విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడీఎం సైదేశ్వరరావు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులు శ్రీహరిరావు, మేనేజర్ ఉపేందర్, ఎగ్జిక్యూటివ్ జగదీష్, సంబంధిత సిబ్బంది, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల గెలుపు.. అభివృద్ధికి మలుపు

- ఆత్మగౌరవాన్ని గెలిపించుకుందాం
- నిబద్ధతగా ప్రజలతో ఉండేది కమ్యూనిస్టులే
- సిపిఐ అభ్యర్థులను గెలిపించడి
- సిపిఐ జాతీయ నేత డాక్టర్ కె.నారాయణ





**భద్రాద్రి బ్యూరో, మహా:** కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కార్పోరేషన్ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని సిపిఐ జాతీయ కమీషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ తెలిపారు. కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో భాగంగా ఆయన శనివారం రామవరంలోని 6 డివిజన్లు, బర్మాక్యాంపు, వ్యాన్బస్తీ, పాత కొత్తగూడెం ఏరియాల్లోని డివిజన్లలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషాతో కలిసి రోడ్లు, బస్తీ కార్నర్ మీటింగ్లలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎర్రజెండాలతో ఎదురేగి పెద్ద ఎత్తున హారతులు పట్టారు. సిపిఐ జిందాబాంద్, ఎర్రజెండా వర్ధిల్లాలి అంటూ నినాదలు చేయడంతో పాటు పలువురు మహిళలు విజిల్స్ వేస్కూ, డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ప్రచారాన్ని ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించడం ద్వారానే పాల్వంచతో కలిపి కార్పోరేషన్ను ఏర్పాటు చేయడం జరిగిందనే విషయాన్ని ఓటర్లకు గుర్తు చేశారు. మూడు దశాబ్దాలుగా ఎన్నికలు జరగని పాల్వంచకు ఎన్నికలు జరిపించడమే కాకుండా కొత్తగూడెంను కార్పోరేషన్గా మార్చిన ఘనత సిపిఐదే అన్నారు. కార్పోరేషన్ ఎన్నికల వేళ ఊరు పేరు, అడ్రస్ లేని గుంట నక్కలు ఓట్ల కోసం వస్తున్నాయని అలాంటి వారి వట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ ఎన్నికలు ఆత్మగౌరవానికి అహంకారానికి నడుమ సాగుతున్నాయని ఓట్ల కోసం కల్లబొల్లి మాటలు చెప్పి ఎన్నికలు పూర్తయిన తర్వాత ముఖం చాటేస్తారని కానీ నిత్యం ప్రజలతో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకునే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటే అన్ని విధాలా బాగుంటుందన్నారు. స్థానిక సిపిఐ నేతలే కార్పోరేషన్ ఎన్నికల్లో నిలబడ్డారని మన వారు మనతో నిత్యం ఉండే వారిని గెలిపించుకోవడం అంటే మనల్ని మనం గెలిపించుకున్నట్లే అన్నారు. అధికారం ఎటుంటే ఆ పార్టీ కండువాలు కప్పుకునే వారికి ప్రజల ఓట్లు అడిగే నైతిక విలువ లేదని అధికారం లేని రోజుల్లో ఈ నాయకులుగా చెప్పుకునే వారు ఏ నాడైనా ప్రజలతో మమేకమయ్యారా అని ప్రశ్నించారు. కానీ కమ్యూనిస్టులు అధికారం ఉన్నా లేకున్నా పేదలు బడుగు బలహీన వర్గాలు కార్మికులు కర్షకుల వెంట ఉంటూ వారి సమస్యల కోసం పోరాటాలు చేస్తారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా కూనంనేని సాంబశివరావు గెలిచిన నాటి నుండి ఈ ప్రాంతాలు ఎంతో అభివృద్ధికి నోచుకున్నాయని ప్రజా అవసరాలు సమస్యలపై అవగాహన ఉన్న నాయకులు కాబట్టి ఆయా ప్రాంతాల్లో మౌళిక సదుపాయలను కల్పిస్తూ భవిష్యత్ అవసరాలకు ప్రణాళికలు రచిస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తూ నిధులు రాబడుతున్నారని తెలిపారు. నూతనంగా జరగబోయే కార్పోరేషన్ పాలనలో పారదర్శకత ఉండాలంటే ఎర్రజెండా అభ్యర్థుల విజయం అవసరమని తద్వారా అవినీతి రహిత పాలన ప్రజలకు అందుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, నలిగంటి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, ఎస్కే ఫహీమ్, వీరస్వామి, వాసిరెడ్డి మురళీ, ఉదయ్ భాస్కర్, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శాంతి శ్రీ, నాయకులు వాకపల్లి హరినాథ్, గోపి కృష్ణ, జహీర్, ఉల్లోజు వెంకట్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, జక్కుల గట్టయ్య, కిరణ్, భవాని, నగేష్, కిలార్ ప్రసాద్ పాటు అభ్యర్థులు భూక్య శ్రీనివాస్, మునిగడవ పద్మ, కంచర్ల హిమశ్రీ, ఎర్రబెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజశేఖర్

**మణుగూరు, మహా :** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాంబార్ రాజశేఖర్ను నియమించారు. మణుగూరు సింగరేణి ఏరియా ప్రకాశం ఖని ఓపెన్కాస్ట్--2లో ఆపరేటర్గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు శనివారం నియామక ఉత్తర్వులను టిబిజికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ సంస్థ ప్రగతి, కార్మిక సంక్షేమం, హక్కుల సాధన, పరిరక్షణే లక్ష్యంగా కార్మికులు, వారి కుటుంబాలకు నిస్వార్థ సేవలు అందించాలని రాజశేఖర్ కు సూచించారు. మణుగూరు ఏరియాలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా పనిచేయాలని, రాష్ట్రంలో కేసీఆర్ పాలన తిరిగి రావడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.నియామకానికి స్పందించిన సాంబార్ రాజశేఖర్ మాట్లాడుతూ, సింగరేణిలో వేగంగా ఎదుగుతున్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి మణుగూరు ఏరియా నుంచి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవి లభించడం గర్వకారణమన్నారు. కార్మిక సేవనే లక్ష్యంగా భావించే నాగెల్లి వేంకటేశ్వర్లు నాయకత్వంలో కలసి పనిచేసే అవకాశం తన అదృష్టమని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన యూనియన్ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్కు, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, చెన్నూరు ప్రభుత్వ విప్, మాజీ ఎంపీ బాల్క సుమన్కు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ విప్, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగ కాంతరావుకు, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డికి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణకు, జనరల్ సెక్రటరీ కె. సురేందర్రెడ్డికి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తికి, సీనియర్ వైస్ప్రెసిడెంట్ నూనె కొమరయ్యకు, మణుగూరు ఏరియా వైస్ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్కుమార్, పి.కె. నాగరాజు, నిఖిల్, అశోక్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**మణుగూరు, మహా:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 2026 నూతన క్యాలెండర్ను మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్, చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రామ్చందర్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, మణుగూరు ఏరియా ఉపాధ్యక్షులు శనిగరపు కుమారస్వామి నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం దుర్గం రామ్చందర్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి వెల్ఫేర్ అసోసియేషన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఉద్యోగుల ఐక్యత, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాసచారి, అధికార ప్రతినిధి ఎస్. రమేష్, మణుగూరు ఏరియా లైజన్ ఆఫీసర్ ఎం. నరసింహారావు, ఏరియా రక్షణ అధికారి ఏ.వి. రామారావు, మణుగూరు ఓసీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్తో పాటు అసోసియేషన్ సభ్యులు ప్రమోద్, మామిడి రాజు, అశోక్, డి. శ్రీను, వినోద్, మధుబాబు, అనిల్, బిక్షారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా కుంజ కృష్ణకుమారి స్మారక క్రికెట్ టోర్నమెంట్స్ ప్రారంభం

**మణుగూరు, మహా:** మణుగూరు మండలం పగిడేరు మాజీ సర్పంచ్, ఎంపీటీసీ అమరజీవి కుంజ కృష్ణకుమారి స్మారక క్రికెట్ టోర్నమెంట్స్‌ను శనివారం గొల్లకొత్తూరు క్రికెట్ క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభించారు. అమరజీవి కుంజ కృష్ణకుమారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా పగిడేరు సర్పంచ్ కుంజా శ్రావణ్‌కుమార్ రాజా ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో తాసిల్దార్ అద్దంకి నరేష్ టాస్ వేసి పోటీలను ప్రారంభించగా, మణుగూరు ఏరియా 100 పడకల ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సునీల్ తొలి బ్యాటింగ్ చేసి టోర్నమెంట్స్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్ అద్దంకి నరేష్ మాట్లాడుతూ క్రీడలు యువతీ యువకుల్లో ఐక్యత, సమైక్య స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతను ఒక తాటిపైకి తీసుకొచ్చే శక్తి క్రీడలకు ఉందని పేర్కొన్నారు. యువత ఎక్కువ సమయం క్రీడా మైదానాల్లో లేదా గ్రంథాలయాల్లో గడపాలని సూచించారు. అనంతరం డాక్టర్ సునీల్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయన్నారు. నేటి యువత సెల్‌ఫోన్, సోషల్ మీడియా, మత్తుపదార్థాలకు బానిసలవుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని, వాటి నివారణకు క్రీడలు తప్పనిసరిగా ఆడాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతం మల్లు స్వరాజ్యంగా పేరుగాంచిన కృష్ణకుమారి ఆశయాలు, ఆదర్శాలను యువత కొనసాగించాలన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్స్‌లో 10 జట్లతో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. క్రీడా స్ఫూర్తితో స్మారక క్రికెట్ టోర్నమెంట్స్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గువ్వా రాంబాబు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, మండల కన్వీనర్ కొడిశాల రాములు, కుంజా రాజు, టోర్నమెంట్స్ ఆర్గనైజర్ బేతమల్ల సుందర్, ముల్కి వేణు, రెంటాల నరసయ్య, కుంజా నరసింహారావు, కుంజ వరదయ్య, సింగారం సమితి 12వ వార్డు సభ్యుడు వేర్పుల నరేష్, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

## వేతనాలొచ్చేశాయ్...

**నేలకొండపల్లి, మహా:** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహాకుల కు గౌరవ వేతనాలను ప్రభుత్వం విడుదల చేసింది. నేలకొండపల్లి మండలం లోని 40 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 13, ఉన్నత పాఠశాలలో మొత్తం 101 మంది వంట నిర్వహాకులు పని చేస్తున్నారు. వీరికి ప్రతీ నెలా కేంద్ర ప్రభుత్వం పీయం పోషణ పథకం లో భాగంగా రూ. 1,000, రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం రూ. 2 వేల చొప్పున అందిస్తున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన బకాయిలు నవంబర్, డిసెంబర్ రెండు నెలల పెండింగ్ 101 మందికి రూ. 2 వేల చొప్పున ఒక్కోక్కరికి రూ. 4 వేల చొప్పున వారి ‘ –ఖాతాలో తాజాగ జమ అయ్యాయి. మొత్తం 4.04 లక్షలను పథకం నిర్వహాకుల ఖాతాలో జమయ్యాయి. కాగా జనవలి నెలకు సంబంధించిన కేంద్రం అందించే రూ. 1,000 గౌరవ వేతనం ను ఈ నెల 5 తేదిన వారి ఖాతాలో జమ చేశారు. గతంలో వేతనాల కోసం కార్యాలయాల చుట్టూ కార్మికులు ప్రదక్షిణలు చేసే పరిస్తితి ఉంది. కానీ ప్రస్తుతం గౌరవ వేతనాలు నేరుగా వారి ఖాతాలలో జమ అవుతున్నాయి. గౌరవ వేతనాలు కార్మికుల జనవరి నెలకు సంబంధించిన వారి ఖాతాలో జమ చేసినట్లు నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ. చలపతిరావు తెలిపారు.



# మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారానికి జన సైనికులు పయనం

### పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ వెల్లడి

**జూలూరుపాడు, మహా:** రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో జనసేన పార్టీ అభ్యర్థులు కూడా ఎన్నికల బరిలో దిగడం జరిగింది. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ బీఫామ్ తో 22 మంది అభ్యర్థులు ప్రధాన పార్టీలతో తలపడుతున్నారు. వారి గెలుపు ను కాంక్షిస్తూ, వారికి తోడుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు జూలూరుపాడు మండలం నుండి సుమారు 60 మంది జన సైనికులు, బయలుదేరనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఏవిఆర్ ఫంక్షన్ హాల్ లో మండల ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్టీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో భాగంగా పాల్వంచ మునిసిపాలిటీ పరిధి 40వ వార్డులో



ముత్తినేని శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో పార్టీ కార్యకర్తలతో పాటు, పవన్ కళ్యాణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాటికొండ చలపతిరావు, చలమల విజయ్, పర్స నాగరాజు, పురేటి ఉదయ్ కిరణ్, సారంగి మల్లికార్జున్, గణప సాయి, ధర్మరాజుల బన్నీ, యాస రాకేష్, రేగుముడి పుల్లారావు, నిమ్మటూరి తరుణ్, మద్దిబోయిన యల్లేశ్వరావు, చేతుల సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ మేనేజర్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో రూ.28 లక్షల లంచం డిమాండ్ చేసిన కేసులో పరారీలో ఉన్న ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ తాటి శ్రావణిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన ప్రకటనను శనివారం ఏసీబీ అధికారులు విడుదల చేశారు. లంచం విషయంలో గత జనవరి 3వ తేదిన ప్లాంట్ మేనేజర్ రాజేందర్ రూ.3.50లక్షలు తీసుకుంటూ పట్టుపడ్డాడు. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన డివిజనల్ మేనేజర్ తాటి శ్రావణి అప్పటినుంచి పరారీలో ఉండగా నమ్మదగిన సమాచారం మేరకు విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ వద్ద వుండగా ఆమెను పట్టుకొని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేశారు.



## సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**కారేపల్లి, మహా:** ఐసీడీఎస్ ద్వారా అంగన్వాడీ కేంద్రా లలో శిశువులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు అందజేస్తున్న సేవలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చీమలపాడు సెక్టార్ ఐసీడిఎస్ సూపర్వైజర్ మోకాళ్ళ రమణ కోరా రు. రేలకాయల పల్లి, గేటు రేలకాయలపల్లి గ్రామ పంచాయతీలలో గల అంగన్వాడి కేంద్రాలలో శనివా రం పోషకాహార దినోత్సవంలో భాగంగా గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, 0-5 ఏళ్ల పిల్లలకు టీకాలు , ఆరోగ్య తనిఖీలు, పోషకాహార పంపిణీలను తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కొత్త గర్భిణీలను నమోదు చేయడం, పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించారు. పిల్లల ఇండ్లకు వెళ్లి తల్లులకు శిశువుకు పాలు ఇచ్చే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎనఎం కళావతి, సునీత, అంగన్వాడి టీచర్లు సుజాత, శిరోమణి, ఆశా కార్యకర్త ఈశ్వరి పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## క్రీడల్లో ప్రతిభ కనబర్చిన
# గాంధీపురం స్కూల్ విద్యార్థులు

**కారేపల్లి,మహా:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2026 జిల్లా స్థాయి క్రీడల పోటీలకు గాంధీపురం గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు.గురువారం వైరా నియోజకవర్గస్థాయి పోటీలలో గెలిచి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ సందర్భంగా గాంధీ పురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిం చారు. ఖో ఖో విభాగంలో ఐదుగురు విద్యార్థులు డి.గోపీచంద్,పి. ప్రమోద్,పి. సంతోష్,ఎం.సృజన్, టి.గౌతమ్ అర్హత సాధించగా, అథ్లెటిక్ విభాగంలో పి సంతోష్ ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు ఆయన తెలిపారు.విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారి గెలుపులో ముఖ్యపాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులు పీడీ రామమ్మ,పిఈటి బి.మోతీలాల్ లను ప్రిన్సిపాల్ అభినందించారు. గాంధీ పురం పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా చురుగ్గా ఉంటారని, విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయడం ఉపాధ్యాయుల పాత్ర కూడా కీలకమని అన్నారు. మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడే క్రీడల పట్ల తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తుందనీ తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# మున్సిపాలిటీల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయం

## బిజెపి జాతీయ సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఈనెల 11వ తేదీన కొత్తగూడెం ఇల్లందు అశ్వరావుపేటలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమని బిజెపి జాతీయ సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ మున్సిపాలిటీలలో బిజెపి అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వీరి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేయడం జరిగిందన్నారు. బిజెపి అభ్యర్థులను గెలిపించినట్లయితే కేంద్ర సహకారంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. ఇప్పటికే ఈ మూడు పట్టణాలలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేవలం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకే దక్కుతుందని చెప్పారు. బీజేపీ పాలనలో మహిళా సాధికారత చారిత్రాత్మకం అపూర్వమైనదిగా ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ఒక్క హామీని కూడా అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధిలో నెంబర్ వన్ గా నిలుపుతామని పేర్కొన్నారు. కొత్తగూడెంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని అంతేకాకుండా అభివృద్ధికి కేంద్రం నుండి నిధులను విడుదల చేయించడం జరుగుతుందన్నారు. కొత్తగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను సైతం పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే కేంద్రం నిధులతో ఇక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. పేదలకు 5 కేజీల బియ్యం సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఇతర సంక్షేమ పథకాలలో కేంద్ర సహకారం ఎంతో ఉందన్నారు. విషయాన్ని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ పాలనకు తెలంగాణ ప్రజలు విసిగిపోయారని తెలిపారు. లోట్టపోయి సొట్టపడ్డ కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు తన్నితరిమేస్తారని చెప్పారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను నిండా ముంచారాని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రైతు బంధు, మహిళలకు 2500, తులం బంగారం, అవ్వ తాతలకు 4000 పింఛను, విద్యార్థులకు స్కూటిలు, ఇస్తానని చెప్పి అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ ను కూడా రేవంత్ సర్కార్ ఇవ్వలేదన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. సింగరేణిపై వస్తున్న ఆరోపణలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. అభివృద్ధి చేసే బిజెపి పార్టీ గుర్తు కమలంపై అమూల్యమైన ఓటేసి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రంగా కిరణ్, జీవీకే మనోహర్, కార్పొరేషన్ బిజెపి అభ్యర్థి విద్యాసాగర్, కొత్తగూడెం పాల్వంచ బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బాలో ఘనంగా వీడ్కోలు వేడుక




**కారేపల్లి, మహా :** కారేపల్లి కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో శనివారం ద్వితీయ ఇంటర్, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకను ఘనంగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులు సీనియర్లకు ఆల్‌ది బెస్టు తెల్పుతూ వారికి పూలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో దుగ్గిరాల జయరాజు హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఆకాంక్షించారు. టాలెంట్ టెస్టు, క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారని, జాతీయ స్థాయిలో ఖాన్ అకాడమీ ద్వారా అవార్డు అందుకోవటం లో స్పెషల్ ఆఫఈసర్ ఝాన్సీ సౌజన్య కృషిని కొనియాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌజన్య, విజయలక్ష్మి, ఝాన్సీ, కవిత, వసంత, మమత, సరిత, కళష్ణవేణి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మేనిఫెస్టో లేదు.. మాటల గారడే

**భద్రాద్రి బ్యూరో, మహా:** కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. రెండు రోజులు మాత్రమే సమయం ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులు ప్రచారానికి పదును పెట్టి కొందరు స్వయంగా ఓటర్లను కలిసి తను గెలిపించాలని వేడుకుంటున్న పరిస్థితి నెలకొంది. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని కొన్ని డివిజన్లలో ప్రచారానికి వచ్చే అభ్యర్థులను మేనిఫెస్టో ఎక్కడ..? అంటూ ఓటర్లు ప్రశ్నిస్తున్న పరిస్థితి ఏర్పడుతుంది. స్పష్టమైన హామీలు లేకుండా, సమస్యలకు పరిష్కార మార్గాలు చూపకుండా కేవలం మాయమాటలతో ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలపై పలు డివిజన్లలో విస్మయం వ్యక్తమవుతోంది. అటు పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై కోపం, ఇటు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో జాప్యంపై అసహనం ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా.. పట్టించుకోని పార్టీల తీరుతో విసిగిపోయిన ఓటర్లు ఈసారి ఇండిపెండెంట్ అభ్యర్థుల వైపు మొగ్గు చూపుతున్నట్లు భద్రాద్రి జిల్లా కేంద్రంలో కొంత చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో అడ్రస్ లేని హామీలు, అమలు కాని గాలిమాటల మధ్య ఓటర్లు ఎవరికి పట్టం కడుతారో..? అనే ప్రశ్న తలెత్తుతుంది.

### ఎన్నికలవేళ విందుతో గాలం..

ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో కొంతమంది అభ్యర్థులు ఓటర్లకు విందుతో గాలం వేస్తున్నారు. అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించే వారికి, వార్డుల్లో ప్రధాన ఓటర్లకి విందుతో మంచిగా చేసుకుంటున్నారు. కొందరు పెద్ద మనుషులకు సైతం మందుతో గాలం వేస్తున్నారు.

### యువత, మహిళలే లక్ష్యం..

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న వారంతా యువత, మహిళలే లక్ష్యంగా ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని లక్ష్యంతో యువత మహిళలే ఓటర్ల కీలకమని భావించి పావులు కదుపుతున్నారు.




### కళకళలాడుతున్న డివిజన్లు...

మున్సిపల్ ఎన్నికల సమయం దగ్గరపడు తుండటంతో అభ్యర్థుల ప్రచారం హోరుతో డివిజన్లు కళకళలాడుతున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. హామీలకే పరిమితం కాకండా నేరుగా ఓటర్లను ఆకర్షించే వ్యూహాల వైపు ప్రచారం మళ్లింది. ప్రత్యర్థి పార్టీలపై పైచేయి సాధించాలన్న లక్ష్యంతో అభ్యర్థులు ఖర్చులకు వెనకాడటం లేదు. మహిళలు, పేదలు, యువ ఓటర్లే టార్గెట్గా వ్యూహాలు అమలు చేస్తున్నారు.



# మున్సిపాలిటీ ప్రచారంలో మండల నేతలు

**కారేపల్లి, మహా :** వైరా మున్సిపాల్టి ప్రచారంకు కారేపల్లి మండల నేతలు తరలివెళ్ళారు. శనివారం వైరాలో నిర్వహించిన ప్రచారంలో సింగరేణి మండలం నుండి సర్పంచులు వెళ్లారు పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మ, ఉసిరికాయలపల్లి సర్పంచ్, వరలక్ష్మి రాజు, నాను నగర్ తండా సర్పంచ్ విజయ కుమారి లాలు, పోలంపల్లి సర్పంచ్ హేమలత, గాదెపాడు సర్పంచ్ రంజిత్ కుమార్ ,కాంగ్రెస్ నాయకులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. వైరాలో కాంగ్రెస్ ఆభ్యర్దులకు ఓటర్ల నుంచి మద్దతు లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బానోత్ దేవ్లా నాయక్,ఐలయ్య, భీముడు నాయక్, ధరావత్ వినోద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# మధిర అంటే నాకు ప్రాణం



**మహా,ఖమ్మం(మధిర):** మధిర అంటే నాకు ప్రాణం.ఉపముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించిన మీ రుణం తీర్చుకుంటా..నన్ను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు .. మధిరను అద్భుతమైన పట్టణంగా రూపుదిద్దుతా అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమల్లు భావోద్వేశ ప్రసంగం చేశారు.శనివారం మధిర మున్సిపాలిటీ లో బరిలో నిలిచిన కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థుల విజయం కాంక్షిస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లలో ఆయన మాట్లాడారు.మధిర కీర్తి ప్రతిష్టలను పెంచుతూ,మరో 50 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అద్భుతమైన పట్టణాన్ని నిర్మించే బాధ్యతనునేను తీసుకుంటున్నాను అని హామీ ఇచ్చారు. హైదరాబాద్, అమెరికా తరహాలోమధిరలో అత్యున్నత వైద్య రక్షణ సదుపాయాలు కల్పిస్తాం. రెప్పపాటు కూడా కరెంటు పోకుండా అండర్ గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థను, స్వచ్ఛమైన నగరం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతం చేస్తున్నాం.స్ పట్టణ విస్తరణకు కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు పనుల కోసం ఇప్పటికే నిధులు జమ చేశాం.వర్షపు నీరు, మురుగు నీటి తరలింపునకు ప్రత్యేక మార్గాలు నిర్మిస్తూనే,వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతున్నాం. మన బిడ్డలు పోటీ పరీక్షలకు మధిరలోనే సిద్ధమయ్యేలా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రత్యేక శిక్షణ, లోన్లు ఇండస్ట్రియల్ పార్కులో స్థలాలు కేటాయిస్తాం అని హామి ఇచ్చారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామన్నారు. డంపింగ్ యార్డ్ తొలగించి వైరా నది పరివాహక ప్రాంతాన్ని పార్కులు, వాకింగ్ ట్రాక్లతో సుందరంగా తీర్చే బాధ్యత తీసుకుంటానని అన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో వీసమెత్తు అవినీతి జరగకుండా నేనే స్వయంగా నాణ్యతను పర్యవేక్షిస్తాను. అభివృద్ధి అంటే మధిర అన్నట్టుగా రాష్ట్రానికే రోల్ మోడల్గా నిలుపుతాను. ఈ మహాయజ్ఞంలో తోడుగా నిలిచేందుకు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి అని మధిర ఓటర్లను కోరారు.

# వర్తక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు సన్మానం

**పినపాక,మహా:** మండల పరిధిలోని ఏడుల్లా బయ్యారం వర్తక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని వర్తక సంఘం అధ్యక్షులు గుండు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, గతంలో ఎంపీవోగా పనిచేసినప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ఆయన చురుకైన సహకారం అందించారని, ప్రస్తుతం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించడం ఆనందకరమని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అనంతరం ఈ--బయ్యారం క్రాస్‌రోడ్ల వద్ద ఉన్న సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా క్రాస్‌రోడ్ ప్రాంతంలో ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారిన బాత్రూం సమస్యను పరిష్కరించాలని, అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, మోహన్ రావు, లక్ష్మణ్, గీదా సాయి, గ్రామస్థులు పాల్గొన్నారు.

